## కథ

పరంధామయ్యగారు మంచం మధ్యలో అచేతనంగా పడుకొని పైన మంద్రంగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్‌కేసి చూస్తున్నారు. కళ్లు ఫ్యాన్‌ని చూస్తున్నా మెదడులోని దృష్టి కేంద్రం మాత్రం దాన్ని నమోదు చెయ్యటం లేదు. ఆ మాటకొస్తే మెదడులోని ఏ కేంద్రమూ పనిచెయ్యటం లేదు, ఒక్క ఆలోచనా కేంద్రం తప్ప!

ఆయన ఈమధ్యనే పదవీ విరమణ చేశారు.



పరంధామయ్యగారికిద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయికి మూడేళ్లనాడే పెళ్లైంది. పెళ్లినాడు కట్నం గట్రా కాక, భర్తకి స్కూటరూ, కలర్ టీవీ లాంఛనాలుగా తండ్రిచేత కొనిపించి, బదులుగా ఆయన్నిద్దరు మనవళ్లకి తాతని చేసింది.

రెండో అమ్మాయి డిగ్రీ చదివింది. టీచర్ ట్రైనింగ్ పాసై అయిదేళ్లనించీ ఓ ఎలిమెంటరీ స్కూల్లో పనిచేస్తోంది.

ఉద్యోగంతో ఆడపిల్ల జీవితంలో స్థిరపడినట్లు కాదనుకునే లోకాభిప్రాయానికి అంత లోకానుభవమున్న పరంధామయ్యగారూ అతీతులు కాలేకపోయారు. రిటైరైతే పెళ్లి చెయ్యటం మరీ కష్టమవుతుందనిపించి, దీపముండగానే యిల్లు చక్కబెట్టాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఉద్యోగి జీవితానికి జీతమే దీపం కదా!

తనకి పరిచయమున్న మిత్రులందర్నీ సంబంధాల కోసం వాకబు చేయసాగారు. ఆడపిల్ల తండ్రికీ, రైతుకీ ఓ సారూప్యముంది. జూదంలా మారిపోయింది వ్యవసాయం. నారు పోసిందగ్గర్నించీ, పంట ఇంటికొచ్చిందాకా ఆశాజీవిగా బ్రతకాల్రి రైతు. అలాగే సంబంధాలు చూడటం విశేషం కాదు..మంచి అల్లుడి ఎంపిక ఓ పెద్ద జూదం!

మూడుముళ్లు పడ్డాక..కాలం గడిస్తేగానీ..అల్లుడి నిజస్వరూపం అవగతం కాదు. అల్లుడు మంచివాడైతే అత్తమామల ఆయువు పెరుగుతుంది. కాకపోతే డాక్టర్ల ఆదాయం పెరుగుతుంది. ఒక్కటే తేడా..రైతుకి మరో పంట మీద ఆశకి మళ్లీ అవకాశముంటుంది. జీవితంలో..అలాంటి అవకాశం లేకపోయె!

అనేక సంబంధాలు చూసి, సమీక్షలు చేసి, ఎట్టకేలకు వర నిర్ణయం చేశారు పరంధామయ్యగారు.

వెంకట్రావు బిఏ, బియిడి చదివాడు. ఓ ప్రయివేటు స్కూల్లో పనిచేస్తూ..ప్రభుత్వోద్యోగం కోసం ఆరేళ్లుగా డి.యస్సీ దండయాత్రలు చేస్తున్నాడు.

నిజానికీ సంబంధం ఖాయం కావటంలో పరంధామయ్యగారి కంటే వెంకట్రావు వైపునుంచే 'బెట్టు సడలని' చొరవుంది. అతనికి గతంలో రెండుసార్లు సంబంధాలు నిశ్చయమై తప్పిపోయాయి. అందుక్కారణం మాత్రం వెంకట్రావే! సంబంధం నిశ్చయమవటం..ఆ వెంటనే డి.యస్.సి ప్రకటన రావటం..తనకి ప్రభుత్వోద్యోగం వచ్చేసినంత హంగామాతో..ముందనుకున్న కట్నం, లాంఛనాల్ని నాలుగుతోనే, అయిదుతోనే హెచ్చవేసి గుండెలదిరే 'ప్రైస్‌కార్డు'తో కొండెక్కి కూచోవటం దరిమిలా అవి రద్దవటం జరిగింది. అలా జరగటం..వెంకట్రావు మాటెలా ఉన్నా ఆ అమ్మాయిలకు మాత్రం అదృష్టంగా పరిణమించిందనే చెప్పాలి. వాళ్లు ఉద్యోగాల్లో చేరి, ఎంచక్కా పెళ్లి చేసుకుని స్థిరపడ్డారు. ఎటొచ్చీ..అది తెలిసిన వెంకట్రావుకే తలకొట్టేసినట్లయింది. మయసభలో దుర్యోధనుడిలా అవమానభారంతో తల్లడిల్లి డీలాపడిపోయాడతను.

ప్రభుత్వోద్యోగమొస్తే 'ధరల పట్టిక' మార్చవచ్చన్న ఆశ మనసులో పీకుతున్నా..గత అనుభవాల దృష్ట్యా ఈసారి రిస్క్ తీసుకోదల్చుకోలేదతను. పైగా..అమ్మాయి యిప్పటికే అయిదారేళ్లుగా ప్రభుత్వోద్యోగంలో ఉంది. అంతేగాక, కట్నం పెరుగుతూ పోయే 'ఫేజ్'తోపాటు..పెరిగే వయసు తగ్గదల 'ఫేజ్'ని కూడా తీసుకురావచ్చు. మీసం రంగు మారాక..రిస్కు మీద పడ్డాక..ఎంత గింజుకుంటే మాత్రం ప్రయోజనమేముంటుందీ?!

ఇవన్నీగాక, వెంకట్రావు మనసులో ఉన్న మరో అంశం..తాళి కట్టాక బంతి ఎప్పుడూ తన కోర్టులోనే ఉంటుందన్న సాంప్రదాయపరమైన సత్యం! కాబట్టే..చదువుకున్న పెళ్లాం రెండువైపులా పదునున్న కత్తి..అనే సామెతని అత్యంత గాఢంగా నమ్మే వెంకట్రావు..ఆమె పర్మనెంటుద్యోగంలో ఉందన్న అందమైన సత్యానికి లోబడి..వివాహానికంగీకరించి, పరంధామయ్యగారి గుండెలమీద కుంపటిని దించే ఘనకార్యానికి సిద్ధపడ్డాడు.

పరంధామయ్యగారు పెళ్లిపీటల మీద యిచ్చిన బాలన్స్ కట్నం డబ్బులో అయిదారు అయిదొందల రూపాయల నోట్లున్న ప్రమాద భరిత కారణంతో..అవి మార్చి వంద నోట్లిస్తేనే తాళి కడతానన్న, వెంకట్రావు విక్రమూర్ఖ పట్టుదల వల్ల అర్ధరాత్రి ముహూర్తం..తెల్లవారు ఝామున మాంగల్యధారణతో విజయవంతంగా ముగిసింది. తన 'మగపుట్టక' విలువ పెళ్లికొచ్చిన అందరికీ అర్థమయ్యేలా చెయ్యగలిగిన ఆ క్షణం..నుంచీ కిరీటం తీసి పక్కనపెట్టినా తలవంచని దుర్యోధన పాత్రధారిలా రాజసం వెలగబెట్టాడు వెంకట్రావు.

★★★

శని, ఆదివారాల సంసారంతో..జీవితంలో ఏదైనా మార్పు వచ్చిందా? రాలేదా? అని తెలియని అస్పష్టతతో కాలం వెళ్లబుచ్చుతోంది సునీత. వచ్చిన మార్పు ఒక్కటే..అంతకుముందు జీతం తనే తండ్రికిచ్చేది. ఇప్పుడు వెంకట్రావే అడిగి తీసుకుంటున్నాడు.

అలా తీసుకున్న మొదటిసారి ఓ వంద ఆమె చేతిలో పెట్టి ''భోజనం ఎలాగూ ఇంట్లోనే కదా! పై ఖర్చులకుంచుకో!'' అన్నాడు ఉదారంగా.

ఆమె అవాక్కయింది!

''రోజా పూలూ గట్రా కొనకు. నేనొచ్చే రోజుల్లో మాత్రమే కొనుక్కో! చాలు'' అన్నాడు వెంకట్రావు-మరో పొదుపు మార్గం బోధిస్తూ!

భర్త రస హృదయానికి పొంగిపోలేదామె. కనీసం ఆ రెండు రోజులైనా 'నేనే తెస్తా' నన్నందుకు కుంగిపోయింది సగటు భారతీయ అల్పసంతోషి భార్యామణి. ఆరోజునుంచే ఆమె మనసు మల్లెలకి దూరమైంది.

★★★

సంతోషంగా ఉంటే కాలం వేగంగా కరిగిపోతుంది.

**తాళి కట్టాక బంతి ఎప్పుడూ తన కోర్టులోనే ఉంటుందన్న సాంప్రదాయపరమైన సత్యం! కాబట్టే..చదువుకున్న పెళ్లాం రెండువైపులా పదునున్న కత్తి..అనే సామెతని అత్యంత గాఢంగా నమ్మే వెంకట్రావు..ఆమె పర్మనెంటుద్యోగంలో ఉందన్న అందమైన సత్యానికి లోబడి..వివాహాని కంగీకరించి, పరంధామయ్యగారి గుండెలమీద కుంపటిని దించే ఘనకార్యానికి సిద్ధపడ్డాడు.**

సునీతకి మాత్రం నత్తనకడతో సాగుతోంది. పెళ్లయి మూడునెలలే అయినా..ఎన్నో యేళ్లు గడిచిన ఫీలింగ్. అంతా అసంతృప్తి. ఎంతో వెలితి!..నెల తప్పిన ఆనందానుభూతిని కూడా మింగేస్తూ!

ఆ రాత్రి..

ఆమె జీవితంలో కాళరాత్రి..

వివాహ వ్యవస్థ సిగ్గుతో తలదించుకున్న రాత్రి.

తాళి ఎగతాళి అయిన రాత్రి.


మనిషిలోని రాక్షసాంశ నిద్రలేచిన రాత్రి.

పరంధామయ్యగారి మెదడులోని రక్తనాళాలు బ్రద్దలైన రాత్రి!

వెంకట్రావు కీచకావతారంతో ఏ అనుభూతీ, పులకింత మిగల్చని యాంత్రిక దాంపత్యం తరువాత...

ఇద్దరి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలుతోంది!

''ఈ మౌనం ఏ పెను తుఫాను సూచికో?!'' అని సునీత లోలోపల కళవెళ పడుతూండగా..



''సునీతా!'' అన్నాడు వెంకట్రావు. ఆ స్వరంలో ఆ సమయంలో వినిపించాల్సిన సౌకుమార్యం లేదు. పది కాగితాలు బొత్తిపెట్టి పర్రుని చించినట్లు గరగరలాడింది.

మొదలు కానున్న సంభాషణ ఏ సరిక్రొత్త ఆంక్షలు విధిస్తుందో?! అనుకుంటూ..వినిపించనట్లుండిపోయిందామె.

''ఏయ్! నిన్నేనే!'' రెండు మేఘాల ఒరిపిడి శబ్దం.

భార్యని 'ఏమే! ఒసే' అనే మాటంటే ఆమెకి ఒళ్లంతా గొంగళి పురుగులు పాకుతున్నంత అసహ్యం. తనకంటే ముందు పెళ్లిళ్లయిన స్నేహితురాళ్లతో చాలా సార్లు అందామాట! ఇప్పుడా అసహ్యం తన జీవితంలో ఓ భాగమైంది. అసహ్యాన్ని కూడా దినచర్యగా స్వీకరించేంతగా తనని వంచిన తాళిని తిట్టుకుంటూ-

''ఊ!'' అంది నిరాసక్తంగా.

ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. పెను తుపానుకి ముందు వీచే సుడిగాలి తనని చుట్టేసినట్లు ఫీలైందామె!

''నువ్వుద్యోగంలో చేరి ఎంత కాలమైందే?''

''నాలుగేళ్లు దాటిందేమో?!'' ముక్తసరిగా అంది.

''సరిగ్గా ఎంత కాలమైందో చెప్పు''

డా. శాంతిశ్రీ

రెండు నిమిషాల తరువాత ''నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలలు'' అంది.

''నెల జీతమెంత?''

ఆమె మాట్లాడలేదు.

''కాస్త రివర్సయిందనుకో..నావయసు ముప్పై అయిదు! ఇప్పుడు నీ జీతం చెప్పు!'' అదో పెద్ద జోకైనట్లు భళ్లున నవ్వాడు వెంకట్రావు.

''నాలుగువేలు!''

సంభాషణ కొనసాగనిస్తే ఎటుపోతుందో శ్రీమాన్ వెంకట్రావు మనస్తత్వాన్నిబట్టి అనూహ్యం. ప్రమాదం అనివార్యమైనపుడు దాన్ని వీలైనంత వాయిదావేసే ప్రయత్నం సహజం. ఆమె ప్రక్కకి తిరిగి కళ్లు మూసుకొంది.

వెంకట్రావు మెదడు చాలా చురుకుగా పనిచేసింది. కాలిక్యులేటర్‌లా లెక్కలు వేసింది. కంప్యూటర్‌లా ఆలోచించింది. భవిష్యత్ దృశ్యాన్ని ఊహించి మనోనేత్రంతో తిలకించసాగింది. ఆ దృశ్యంలో..వెంకట్రావు స్వంత యింటి డ్రాయింగ్ రూంలో కలర్ టీవీలో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు! బయట పోర్టికోలో తన స్వంత హీరో

హోండా కిటికీలోంచీ కనిపిస్తోంది. బెడ్‌రూంలో డబుల్ కాట్..కమ్మని నిద్రకు స్వాగతం పలుకుతూ 'కర్ల్‌ఆన్' బెడ్.

వర్ణనాతీతమైన ఇంద్రధనుస్సులాంటి ఆ సుందర దృశ్యం మనఃఫలకం నించి చెరిగిపోతుందేమోనని భయపడ్డాడు వెంకట్రావు.

అయినా..

ఆ వూహా దృశ్యాన్ని వాస్తవం చేసే సంఖ్య తేజోవంతంగా మెరుస్తూ కళ్లు చెదరగొడుతోంది బ్రెయిన్ కాలిక్యులేటర్ స్క్రీన్‌పై!

ఊహకంటే వాస్తవం మధురంగా ఉంటుంది.

ఆ మాధుర్యాన్ని సాకారం చేసుకోవాలి.

ఓ అరగంట సీరియస్‌గా ఆలోచించాడు.

ఊహని త్యాగం చేశాడు.

''సునీతా! సునీతా!'' అప్పుడే నిద్రలోకి జారుతున్న ఆమెని కుదిపాడు వెంకట్రావు.

''ఆ డబ్బంతా ఏమైంది?'' ఉద్వేగంగా అడిగాడు.

''ప్రతినెలా మీరే తీసుకుంటున్నారుగా!'' ఆమె సమాధానం ఆవులింతలో కలిసిపోయింది.

''అది కాదే..నీ యాభై ఆరునెలల జీతం..అంతా కలిసి రెండున్నర లక్షలు! మనం ఎంచక్కా ఓ ముచ్చటైన ఇల్లు కట్టుకోవచ్చు. ఏ బ్యాంకులో దాచావు?''

తుపాను కాదు, ఉప్పెనే విరుచుకుపడింది.

''బ్యాంకులో దాచేటంత మిగిలుంటుందా? మన పెళ్లి ఖర్చు. మీకిచ్చిన కట్నం లక్ష..మిగిలింది ఇంటి కింద ఖర్చయింది.''

''అదంతా ఖర్చుపెట్టుకోటానికి వాడెవడు? ఇవ్వటానికి నువ్వెవరు? సిగ్గులేకపోతే సరి!''

అతనంటున్న 'వాడు' ఎవరో సునీతకి వెంటనే అర్థం కాలేదు. అర్థమయ్యాక..కట్టుకున్న భర్తయితే కావచ్చు...తన కన్న తండ్రిని 'వాడు' అనటం సహించలేకపోయింది.

''మగతనాన్ని ధర్మకాటా వేసి మరీ అమ్ముకుంటున్న చదువుకున్న మగాడికి లేని సిగ్గు..కన్న బిడ్డ సంపాదన్ని కుటుంబం కోసం ఖర్చుపెట్టిన తండ్రి కెందుకుండాలి? తన సంపాదనని కనిపెంచిన తండ్రికిచ్చే బిడ్డ కెందుకుండాలి? అయినా మన పెళ్లి కాకముందు మీరెవరో? నేనెవరో? ఈ మూడు నెలల్నుంచీ మీరే తీసుకుంటున్నారుగా!'' పౌరుషంతో పరుషంగా అంది.

''అది కాదే! ఆ డబ్బంతా యిప్పుడుంటే అదంతా నాదయ్యేది కాదా? అయినా..అదెవరికోసం అడిగాను? మనకోసమేగా!''

అతని 'లాజిక్'కి ఒళ్లు మండింది. పెళ్లి పీటల మీద నించీ యిప్పటికి దాదాపు వందరోజులుగా తెచ్చిపెట్టుకున్న సహనం ఒక్కసారిగా స్థితిస్థాపకత కోల్పోయింది.

''మీరు, నేను..'మనం' కాకముందు నా సంపాదనపై మీ పెత్తనం ఏంటి? అసలు పెళ్లయింతర్వాతైనా నా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరిస్తూ పెత్తనం చెలాయించటం మనిషితనమూ కాదు, మగతనమూ కాదు!''

ఆమె చెంప ఛెళ్లుమంది.

''నోర్ముయ్! నీలాంటి అహంకారిని, మొగుడంటే భయభక్తులు లేనిదాన్ని కట్టుకోటం నాదే బుద్ధి తక్కువ. ఏది ఏమైనా..నువ్వా మొత్తం తెస్తేగానీ నీ మొహం చూడను!'' అంటూ లేచి, పేంటు తొడుక్కుని, లుంగీ ఉండలా చుట్టి సంచీలోనెట్టి బయటికెళ్లిపోయాడు వెంకట్రావు.

ప్రతి శని, ఆదివారాల్లో గృహవాతావరణం ఎలాంటి కల్లోలానికి గురవుతున్నా ఆ రాత్రి జరిగిందానికి తట్టుకోలేకపోయారు పరంధామయ్యగారు.

కుడివైపు పక్షవాతం..ఫలితంగా మాట పడిపోయి, నోరారా కూతుర్ని ఓదార్చే అవకాశం కూడా లేకుండాపోయింది. నిస్సహాయంగా, అచేతనంగా ఆలోచిస్తూ పడుకోవటం ఆయన దినచర్య అయింది.

★★★

పులిమీద పుట్రలా సునీతకి వేవిళ్లు మొదలయ్యాయి. బిడ్డపుడితే కలతలు తొలగిపోతాయని ఆశించారు పరంధామయ్యగారు.

సునీత పండంటి బిడ్డని కంది.

వెంకట్రావుకి కబురంపారు.

''వాడు నాకు పుట్టిన బిడ్డేనని గ్యారంటీ ఏమిటి?'' అన్నాడు వెంకట్రావు. భార్యని వదిలించుకోవాలనుకునే మగాడి చేతిలో ఉండే పదునైన ఆయుధమది!

''తన మగతనం మీద ఆమాత్రం నమ్మకం లేని వాడు నాకు మొగుడూ కాదు, మీకు అల్లుడూ కాదు'' కొండంత ఆత్మస్థైర్యంతో తండ్రికి నిబ్బరం నూరిపోసింది సునీత.

కానీ, అప్పటికే పరంధామయ్యగారి గుండె పగిలింది.

పట్టుమని పదిమైళ్ల దూరంలో ఉన్న ఇంటల్లుడి చివరి చూపుకోసం ఇరవై నాలుగ్గంటలు నిరీక్షించిన పరంధామయ్యగారి భౌతికకాయం ఆ కోరిక తీరకుండానే బూడిదైంది.

కట్టుకున్న మొగుడు ఉండీ లేని స్థితిలో..కొండంత అండగా ఉన్న తండ్రి శాశ్వతంగా దూరం కావటంతో ఈ విశాల ప్రపంచంలో ఆమె ఒంటరిగా మిగిలిపోయింది.

భవిష్యత్తుపై ఆశకీ..ఎందుకు బ్రతకాలన్న ప్రశ్నకీ జవాబుగా బిడ్డ..బ్రతుకుదెరువుకి ఉద్యోగం! మనసు కుదుటపడ్డాక కాలం సాఫీగా గడవసాగింది.

భర్తపేరుతో స్వాతంత్ర్యాన్ని హరించే రాక్షసుడ్ని భరించటం కన్నా..ఒంటరిగా బ్రతకటం హాయిగా వుంది. అయితే..కన్న తండ్రిని నిలువునా 'హత్యకాని హత్య' చేసిన వెంకట్రావు కిరాతకాన్ని మాత్రం మరువలేకపోయింది.

ఆమెలో ఆడతనం, ఆలితనం చచ్చిపోయాయి. మిగిలిందొకటే..గుణపాఠం చెప్పాలన్న కసి. ఈ ప్రపంచంలో ఉన్న వెంకట్రావులందరికీ! మంచి లాయర్‌ని కలుసుకుంది. వరకట్న వేధింపుల కేసు పెట్టింది.

★★★

వెంకట్రావు ఏడు సంవత్సరాలు జైలు శిక్షపడి రాజమండ్రి జైల్లో ఏవేవో లెక్కలు వేసుకుంటూ కాలం గడుపుతున్నాడు.

రేపటి పౌరులు కిరాతకులు కాకుండా..మనుషుల్లా పెరగాలని ఆశిస్తూ..ఆ కర్తవ్యంలో కొత్తదారిలో అడుగులు వేస్తోంది సునీత.

ఆ అడుగులే..రేపటి అరుణోదయానికి నాంది!

☆

